
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# ఆకలి

సలీం



చలికాలం కావటం వల్ల సాయంత్రం ఆరింటికే చీకటి పడింది. రోజంతా ఆఫీసులో అస్థిమితంగా గడిచింది. ఏదో తెలీని చిరాకుతో చిన్న విషయానికే ప్యూన్ మీద విరుచుకుపడ్డాను. నా పక్క సీట్లోని రామారావుతో వాగ్వివాదానికి దిగాను.

''ఈ రోజు నీ మూడేదో బావున్నట్లు లేదు. యింట్లో మా సిస్టర్‌తో గొడపడ్డావా?'' చాలా సౌమ్యంగా అడిగాడు రామారావు.

వయసులో నా కంటే పాతికేళ్ళ పెద్దాడు. అనుభవం వల్లనుకుంటాను అతనికి శాంతం ఆభరణమైంది. నా దుడుకుతనానికి సిగ్గుపడుతూ సారీ చెప్పాను.

''పర్లేదులే. నీలా పాతికేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు నేనూ అంతే. పందెపు గుర్రంలా పొగరుగా ఉండే వాణ్ణి. వయసుకు తగ్గట్టు ప్రవర్తించటంలో ఓ రకమైన అందం ఉంటుంది, వైల్డ్ బ్యూటీ...తెలుగులో విశృంఖల సౌందర్యం అనొచ్చేమో. ఇంతకీ ఏమిటీ నీ మెదణ్ణి తినేస్తున్న విషయం?''

''సరోజ పుట్టింటికని వెళ్ళి వారం దాటింది''

''భోజనం ఇబ్బందన్నమాట. హోటల్లో తింటున్నావా లేక చేయి కాల్చుకుంటున్నావా?''

''నాయర్ మెస్సుందిగా...భోజనం రుచిగానే ఉంటుంది.''

''పక్కమీద తోడు లేకపోతే కలిగే చిరాకు అంతేనా? అలవాటు పడిన ప్రాణం కదా. ఇంటికెళ్ళగానే ఎదురొచ్చే ఒంటరితనం భయపెడుతూ ఉంటుంది. ఇంటికెళ్ళాలనిపించదు. వెళ్తే నిద్ర పట్టదు. అశాంతి ...కోపం... ఎవరి మీదో తెలీని కసి. కన్పించిన వాణ్ణల్లా తిట్టాలనిపిస్తూ ఉంటుంది''

నా మనసులో చెలరేగుతున్న భావాల్ని అద్దంలో చూసినట్లు చెప్పేస్తున్న అతని వైపు సంభ్రమంగా చూసాను.

''ఎలా చెప్పగలిగాననుకుంటున్నావా? సింపుల్. వయసులో ఉన్నప్పుడు పెళ్ళాం లేకుండా గడిపే మగాడి పరిస్థితి నాకూ అనుభవమేగా''

కొద్దిగా సిగ్గుపడ్తున్నట్లు అతని వైపు చూసి ''పిచ్చెక్కేలా ఉంది. మీకు ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఏం చేశారూ?'' అని అడిగా.

అతను అటూ ఇటూ చూసి నా చెవిలో చెప్తున్నంత మెల్లిగా చెప్పాడు. ''కమలిని అని ఓ పిల్లుండేది. పిల్లని ఎందుకన్నానంటే వయసు తక్కువే. పద్దెనిమిదికి మించదు. దబ్బపండు రంగులో తళతళా మెరిసిపోతూ ఉండేది. చారెడేసికళ్లు. మహానటి సావిత్రి తర్వాత కళ్ళతో కవ్వించి కావ్యాలు వల్లించగలిగిన

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्वल भविष्य Glorious Past-Brighter Future

మగువ ఆ రోజుల్లో కమలిని ఒక్కటే అని అందరూ చెప్పుకునేవారు''

''రెండు ఫ్యామిలీలన్నమాట''

''అబ్బే ఫ్యామిలీ టైపు కాదు. నర్సరావుపేట సొంతూరు. పెళ్ళిపేరుతో ఎవడో మోసం చేసి వది లేస్తే పొట్టకూటికోసం వళ్లమ్ముకునేది. ఐతేనేం నిఖార్సయిన మనిషనుకో. దేవదాసు సినిమా చూశావా? నాగేశ్వర్రావుగారి దేవదాసు. అందులో చంద్రముఖి గుర్తుందా అలాంటి కేరెక్టర్. సొంత మనిషిలా మసులుకుందంటే నమ్ము. పెళ్ళాం ఊరెళ్లిన లోటే తెలియనిచ్చేది కాదు. అంతటి సుఖాన్ని, వెచ్చదనపు హాయిని ఇచ్చేది''

ఆఫీసు వదిలాక ఇంటికెళ్ళాలనిపించలేదు. అసలే మనసంతా అలజడిగా ఉంటే రామారావు మాటలు తుఫాను బీభత్సాన్ని సృష్టించాయి. కోర్టు సెంటర్ దగ్గర నిలబడి తెల్సినవాళ్ళతో ఓ గంట బాతాఖానీ కొట్టాను. సంభాషణ సినిమాల్లోని బూతు మీదకి మళ్ళింది.

''సెక్స్ అన్నిటికన్నా చాలా పవర్‌ఫుల్ కోరిక. మీరు గమనించారో లేదో హత్యల్లో సగానికి పైగా కారణం సెక్సే. అక్రమ సంబంధాలు...జీవితాలు నాశనమౌతాయని తెల్సినా తెగిస్తున్నారంటే అది ఎంత బలమైన ఆకర్షణో అర్థమౌతుంది. మామూలు ఆకలి శరీరాన్ని మాత్రమే హింసిస్తుంది. కానీ శరీరవాంఛ మనసుని కూడా దహిస్తుంది. మనిషిని రాక్షసుడిలా మారుస్తుంది. అందుకే ఇన్నిన్ని ఘోరాలూ...మానభంగాలు''

''ఆకలి అన్నిటికన్నా బలమైంది. అందుకే ఆకలి, నిద్రా, మైథునం అన్నారు. ఆకలిని తట్టుకోవటమే కష్టం. సెక్స్ మనసులో పుడుతుంది. దాన్ని సులభంగా మన నియంత్రణలో పెట్టుకోవచ్చు. కడుపులో ఆకలి చెలరేగుతుంటే మనసు మొద్దుబారిపోతుంది. ఆ అగ్నిని చల్లార్చటం కోసం మనిషి ఏ నీచానికైనా దిగజార్తాడు. ఆకలికోసం శరీరాన్ని అమ్ముకునేవాళ్ళు. గుప్పెడు మెతుకుల కోసం మర్డర్లు చేసేవాళ్ళు, హింస ప్రజ్వరిల్లటానికి కారణం ఆకలి'' అన్నాడు మరో కమ్యూనిస్ట్ మిత్రుడు.

హోరాహోరీగా వాదులాడుకున్నారు. మిగతా వాళ్లు కూడా రెండు వర్గాలుగా చీలిపోయారు. ''ఆడదాని పొందుకోసం ఎంతటి సాహసానికైనా ఒడిగడ్తాడు మగాడు. అదే ఆకలి కోసం అలా చేయడు. పొట్టనిండా పంపునీళ్ళు తాగి కడుపులోకి కాళ్లు ముడుచుకుని పడుకుంటాడు.'' అని ఒక వర్గం వాదిస్తే ''కడుపునిండినోళ్లకే వేరే కోరికలు కలుగుతాయి'' అనిమరో వర్గం వాదన. చివరికి కొట్టుకునేదాకా పోయారు. వాళ్ళని చూస్తే హింస పెచ్చుమీరడానికి కారణం ఆకలీ, సెక్సుతోపాటు దురహంకారం కూడా నేమోననిపించింది.

రాత్రి తొమ్మిది కావస్తోంది. హోటల్లోకెళ్ళి కూచున్నా. అన్నం తినాలనిపించలేదు. ఓ కప్పు కాఫీ తాగాను. రెండో ఆట సినిమా కోసం టిక్కెట్లు ఇస్తున్నారు. ఏంచేయాలో తోచకసమయాన్ని చంపేయటంలో భాగంగా నే థియేటర్లోకెళ్ళి కూచున్నాను. పచ్చి బూతు సినిమా. హాస్యం పేరుతో లావుగా ఉన్న ఆడోళ్ళని అవమానించే సినిమా.

సినిమా వదిలాక బైటికొచ్చి నిలబడ్డాను. బాగా చలిగా ఉంది. దగ్గర్లోనే ఉన్న హోటల్లోకెళ్లి బిర్యానీ తిని ఇంటికెళ్దామని ప్లాన్. హోటల్ కోసం సందు మలుపు తిరుగుతున్నప్పుడు ఆమె కన్పించింది. సినిమాలోని సన్నటి నాజూకైన మరో హీరోయిన్లా లతలా ఉంది. సందు చివర్లో ట్యూబ్‌లైట్ కింద నిలబడి ఉండటం వల్లేమో ఆమె మొహం వెలుగుతోంది. వయసు పాతిక లోపే ఉంటుందేమో. మంచి రంగు వెడల్పాటి కళ్ళు, ముద్దొచ్చేలా వంపు తిరిగిన సన్నటి పెదవులు అనాయాసంగానే స్కూటర్ ఆగిపోయింది.

అలాంటి స్త్రీల గురించి వినడం తప్ప అనుభవం లేదు. గుండె వేగం పెరిగింది. అసలు అలాంటి స్త్రీనేనా? కాకపోతే ఇక్కడిలా ఒంటరిగా ఎందుకు నిలబడ్తుంది ఇంతటి చలిలో. ఎవరైనా తోడున్నారా అని చుట్టూ చూసాను. లేరు. స్కూటర్ ఆపి ఆమెకు కొద్దిగా దూరంగా నిలబడ్డను, ఎలా అడగాలో ఏమని అడగాలో తెలీని పరిస్థితి. గుటకలు మింగుతూ ఆమె వైపు చూశా. వేరుగా నా పక్కకొచ్చి నిలబడి ''కావాలా'' అందామె. ఇలాటివాళ్లలో ఇంతందమైన వాళ్ళు కూడా ఉంటారా అన్పించింది.

''ఎంత?'' అని అడిగా.

''నైటంతా వుండాలా?''

నేనేమీ మాట్లాడలా. ''నైటంతా అయితే ఐదొందలు'' అంది. నేను స్కూటర్ స్టార్ట్ చేసి ఆమెని వెనక కూచోబెట్టుకున్నా. చలికనుకుంటాను ఆమె చీర కొంగుని వంటికి కప్పుకుని కూచుంది. ఆకలిగా ఉంది. పేగుల్ని మెలిపెట్టేటంతటి ఆకలి. మిలటరీ హోటల్లో రెండు బిర్యానీ పొట్లాలు కట్టించుకున్నాను. ఆమె చేతికిచ్చి స్కూటర్ని ఇంటివైపుకి పోనిచ్చాను.

''ఇంట్లో ఎవ్వరూ లేరా?'' సగం దూరంలో ఉన్నప్పుడు అడిగింది.

''ఎందుకులేరూ డజనుకి పైగానే ఉన్నారు. ఇంటి నిండా జనాలే. చాలరని నిన్ను పిలుకెళ్తున్నా'' అసలే చిరాగ్గా ఉంటే ఆమె ప్రశ్న మరింత చిరాకు కలుగచేసింది. ఆమె కిసుక్కున నవ్వింది వెచ్చటి వూపిరి నరాల్లోకి వూదినంత కమ్మగా ఉందా నవ్వు.

''పెళ్లయిందా?''

''ఏం.. చేస్కుంటావా నన్ను''

ఆమె నవ్వలేదు. చాలా సేపు ఏమీ మాట్లాడలేదు. కఠినంగా మాట్లాడి ఆమె మనసు నొప్పించానేమో ననిపించింది. కొద్దిసేపటి తర్వాత నాలో నేను గొణుక్కుంటున్నట్టు ''సారీ'' అన్నాను.

రోడ్డు మలుపు దగ్గర చెత్తకుండీ ఉంది. నాలుగు కుక్కలు విస్తరాకులో మిగిలిన అన్నం మెతుకుల కోసం భీకరంగా పోట్లాడుకుంటున్నాయి. స్కూటర్ని స్లో చేసి జాగ్రత్తగా పోనిస్తున్నా. రెండు కుక్కలు ముందు టైర్ మీద పడ్డాయి. బ్యాలన్స్ తప్పిపడిపోయాను. ఆమె పెద్దగా కేకపెట్టింది. బిర్యానీ పొట్లాలు నేలపాలయ్యాయి. కుక్కలు ఇప్పుడు విస్తరాకుని వదిలేసి బిర్యానీ పొట్లాల మీద పడ్డాయి.


ప్రాణం వుసూరుమంది. ఇంటికెళ్ళగానే తినాలని ఆరాటపడ్డాను. ఇప్పుడు ఆకలి మరింత కసిగా బాధిస్తోంది. నాలుగడుగులేస్తే ఇల్లు. మరలా భోజనం కోసం నాలుగు కిలోమీటర్లు వెనక్కెళ్ళాలి. నిస్సత్తువ...నిరాసక్తత. ఒక్కపూట తిండి తినకుండా ఉండలేనా ఇంటికి చేరుకున్నాను.

చన్నీళ్ళతో మొహం కడుక్కుని, బట్టలు మార్చుకున్నాక చివరకు కొద్దిగా ఉపశమించింది. హాల్లోని సోఫాలో కూచుంది తను. ఆమెకెదురుగా కుర్చీ లాక్కుని కూచున్నాను.

ఆమె నవ్వు..మత్తుగా మెత్తగా గుండెల్లోకి దిగిపోతున్న కైజారులా పదునుగా నిజం నవ్వేనా అతికించుకుంటారా.

''ఆకలిగా ఉందా?'' ఆమె చూపులో అదోరకమైన జీర.

ఏ ఆకలి గురించి అడిగిందో నాకు నిజంగానే ఆకలిగా ఉంది. ఒక్క పూట తిండిలేకపోతేనే ప్రాణం గిలగిల్లాడుతుంటే రోజుల తరబడి పస్తులుండేవాళ్ళు ఎలా తట్టుకుంటారో? మరో గత్యంతరం లేనప్పుడు



ఎంత బాధనైనా భరిస్తారేమో?

నా ఆకలి గురించి చెప్పకుండా "నువ్వేమైనా తిన్నావా" అని అడిగాను.

ఆమె కళ్లు ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ విచ్చుకున్నాయి. వెంటనే నీలినీడలేవో కమ్మేసి మొహం నిండా ఉదాసీనత ముళ్ళు ముళ్ళుగా గుచ్చుకుంటూ

"మేం ఆకలి కడుపున పుట్టాం. తమాషాగా మా కడుపులోనూ ఆకలిని మోస్తుంటాం" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ విషాదం నవ్వుగా మారే విఫల యత్నం.

ఇంతకూ ఏమైనా తిందా లేదా.

"చదువుకున్నావా?"

"పదో తరగతి తప్పాను. అదే యేడు జీవితంలోనూ తప్పాను కడుపులో ఆకలితో పాటు తొమ్మిది నెలలూ మోసి కన్నకొడుకు. వాడికిప్పుడు ఆరేళ్ళు. వాడూ ఆకలీ కవలలు"

ఆమె మాటలకు పూర్తిగా అర్థం కాకున్నా పదేపదే ఆకలి అనటంతో మరింత బాధ పెడ్తున్న ఆకలి మధ్యాహ్నం కూడా సరిగా తినలేదు. కడుపులో కరకర మండుతో కట్టెల పొయ్యిమీద కిరోసిన్ పోసినట్లు భగ్గున

"ఫ్రిజ్‌లో తినడానికేమైనా ఉన్నాయేమో చూడు"

ఆమె లేచి వెళ్ళి ఫ్రిజ్ తెరిచి చూసింది. తిరిగొచ్చి నా ఎదురుగా నిలబడి, "ఏమీ లేవు చివరికి టమేటా, దోసకాయల్లాంటి కూరగాయలు కూడా లేవు తినడానికి. ఖాళీగా ఉంది" అంది నొచ్చుకుంటున్నట్లు. అది తనయిల్లయినట్లు అతిథికి పెట్టటానికి ఏమీ లేనందుకు చింతిస్తున్నట్లు.

అంత ఆకల్లోనూ నవ్వొచ్చింది స్త్రీ ఎంత గొప్పసృష్టి ప్రతి సృష్టి చేయగల ఆడదానిలో అహంకారానికి బదులు ఎంతటి లాలిత్యం మరెంతటి సున్నితత్వం.

తను వెళ్ళి సోఫాలో కూచుంది. నా వైపు చూస్తూ చేతులు చాపింది "మీ ఆకలిని తీరుస్తాను" అంది.

అనాలోచితంగా కదిలి ఆమె పక్కకెళ్ళికూచున్నాను. కోరికతో కాదు. ఏం చేయాలో తోచక.

"మొదట నాకివ్వాల్సిన ఐదొందలు ఇచ్చేయండి"

"అదేంటి అలా అడిగావు? నేను ఇవ్వనని అనలేదుగా ఇది నా యిల్లు ఎక్కడికి పారిపోతాను"

"మీకన్నా వయసులోనే నేను చిన్నదాన్ని. కాని రకరకాల అనుభవాల్తో తల పండిపోయింది. తమ అవసరం తీర్చుకున్నాక డబ్బులివ్వకుండా దిక్కున్న చోట చెప్పుకో పో అని గెంటేసిన వాళ్ళూ, తిట్లతో పాటు తన్నులూ ఎదురిచ్చిన మహానుభావులూ, నా దగ్గరున్న పదో పరకో లాక్కొని పోయినోళ్లూ మగోళ్ళంటేనే విరక్తి పుట్టేలా మనుషులంటేనే వెగటనిపించేలా"

నాకు పెద్దగా నవ్వొచ్చింది.

"నీ కిప్పుడు డబ్బులిచ్చినా నువ్వెళ్ళే ముందు లాక్కుంటే ఏం చేస్తావు?"

ఆమె సిగ్గుపడింది. అతికించుకున్నది కాదు. నిజమైన సిగ్గే " మీరలాంటి వారుకాదు"

"మరెందుకడిగావు?"

"అలవాటు"

పర్సులోంచి ఐదు వంద రూపాయలనోట్లు తీసి ఆమె చేతికిచ్చాను. వాటిని జాగ్రత్తగా మడిచి తన హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకుంది.

"బైటికెళ్ళొస్తాను. తినడానికేమైనా దొరుకుతాయేమో" ఎటో చూస్తూ అన్నాను. ఆకలిని తట్టుకోలేక పోతున్నందుకు ఒకింత సిగ్గనిపించింది.

"ఓ ఒక్క పూట అన్నం లేకుండా ఉండలేరన్న మాట" ఆమెకు తెలీని కొత్త విషయమేదో తెల్సుకున్నట్లు కళ్ళు టపటపలాడించింది.

"వూహ తెలిశాక అభోజనంగా ఎప్పుడూ పడుకోలేదు" సంజాయిషీ ఇచ్చుకుంటున్నట్లు.

"నేను పక్కనున్నాగా నిద్రెలా పోతారు?మీరు ఐదొందలిచ్చారు. వాటికి న్యాయం చేయొద్దూ" కిసుక్కున నవ్వింది. నవ్వితే ముత్యాలు రాల్తాయా నాకేమో తెల్లతెల్లటి మల్లెపూవుల్లాంటి అన్నం మెతుకులు రాలినట్లనిపించి ఆకలి మరింత పెరిగింది. ఆమె వైపు అసహనంగా చూసాను.

"సారీ మీరీ చలిలో ఈ సమయంలో బైటికెళ్ళినా ఏమీ దొరకదు. రెండో ఆట వదిలేసి గంట దాటింది. హోటళ్లన్నీ మూసేసి ఉంటారు" కొద్ది సేపు ఆలోచించి మరలా అంది. "మనం ప్రస్తుతం ఉంది మీ ఇంట్లో కదా. అదేగా వంట గదీ యింట్లో బియ్యం, కంది పప్పులాంటివి వున్నాయా?" లేచి నిలబడి అడిగింది.

నేను సమాధానం ఇవ్వకుండా ఆమె వైపు శూన్యంగా చూశాను. మరోలా అనుకుందేమో "క్షమించండి. మీ వంట గదుల్లోకి మాలాంటి వాళ్ళు వెళ్ళకూడదేమో" అంది తల వొంచుకుంటూ. ఎగసి




स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
गौरवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

పడిన కెరటంలా ఉందామె. ఆమె పెదవులు బాధతోనో, అపరాధభావనతోనో మెల్లగా కంపిస్తున్నాయి.

ఆమె ఏ ఉద్దేశంతో అలా అందో అర్థం కాలేదు. వళ్ళమ్ముకునే స్త్రీలు సంసారాలు చేసే ఆడోళ్ళ రాజ్యమైన వంట గదుల్లోకి వెళ్ళటం నిషేధమనే అర్థంలో చెప్పిందా లేక.

''ఏం ఎందుకెళ్ళకూడదు''

''మాది తక్కువ కులం'' నా సంశయాన్ని తీరుస్తూ ఆమె మెల్లగా గొణుగుతున్నట్లు చెప్పింది.

''మాది ఎక్కువ కులమని నేను చెప్పానా?''

''మీ మాట తీరు ఇందాక అభోజనంగా అన్నారు చూడండి. నాకు మొదట అర్థం కాలేదు. మీకు అంటు ఉంటుందేమోనని''

పెద్దగా నవ్వొచ్చింది. ''భాషకూ కులానికీ ఏమిటీ సంబంధం? చక్కటి భాషమీద ఏ ఒక్క కులానికో, మతానికో పేటెంట్ హక్కులు లేవు. నీకు శ్రద్ధ ఉంటే నువ్వైనా అలా మాట్లాడగలవు. ఇక ఆకలంటావా నిన్ను పిల్చుకుని ఇంటికి తెచ్చినప్పుడులేని అంటు నువ్వు వంట చేస్తే వస్తుందా''

ఆమె మరలా పెద్ద కెరటంలా ఉవ్వెత్తుకు లేచింది. చీర కొంగుని బిగించి వంట గదిలోకెళ్ళింది.

''అన్నమూ, ముద్దపప్పు చేస్తాను. కుక్కర్‌లో పెడితే తొందరగా ఐపోతుంది. వేడి వేడి అన్నంలో పప్పు, నెయ్యీ వేసుకుని తింటారు గాని ఇంట్లో నెయ్యుందిగా'' అంది వంట గదిలోంచి. మనసులో పొగలు కక్కుతోన్న అన్నం... ఎంత మనోహరమైన దృశ్యమో...కొన్నేళ్ళ క్రితం కాశ్మీర్‌లోయ సౌందర్యాల్ని చూసినప్పుడు దీన్ని మించిన అద్భుతమైన అందం సృష్టిలో ఉండదనుకున్నాను. పొరపాటు... ఇప్పుడు నా కళ్ళకు కన్పిస్తున్న తెల్లటి అన్నపు ముద్దల అందం ముందు అన్నీ దిగదుడుపే.

వంట గదిలో గిన్నెల చప్పుడు మధురమైన సంగీతంలా ఉంది.

''హాల్లో వంటరిగా కూచోకపోతే కుర్చీని వంటగదిలోకి లాక్కోవచ్చుగా. కబుర్లు చెప్పుకుంటుంటే ఆకలి అంతగా బాధించదు''.

నిజమేననిపించింది. కుర్చీని వంట గది తలుపుకు దగ్గరగా లాక్కుని కూచున్నా.

''నీకూ ఆకలిస్తోంది కదూ'' ఆమె వైపు పరీశీలనగా చూస్తూ అడిగా.

''నిజం చెప్పనా? కబుర్లు చెప్తానంది నా ఆకలి బాధ మర్చిపోవడానికే''

''అలవాటైపోతుందన్నావుగా?''


''దొరుకుతుందన్న ఆశ ఉన్నప్పుడు కోరిక మరింత బలపడ్తుంది. మరి కొద్దిసేపట్లో అన్నం తినబోతున్నానన్న ఆలోచనకే పేగులు మెలిపెడ్తున్నాయి.''

''మధ్యాహ్నం తినలేదా?''

ఆమె నిరాశగా నవ్వింది. ''అన్నం తిని మూడు రోజులైంది. నాల్రోజుల్నించీ బాబుకి జొరం. పనికెళ్లటం కుదరలా. వాణ్నే అంటిపెట్టుకుని కూచున్నా. నా దగ్గర మిగిలిన కాసిని డబ్బులు డాక్టరు ఫీజుకి, వాడి మందులకీ సరిపోయాయి. వాడికి రెండు రొట్టె ముక్కలు, పాలు కొనిపెట్టటానికి డబ్బుల్లేక పక్క గుడిసెలో ఉన్న ఎంకట లక్ష్మి దగ్గర అప్పు చేశాను. ఎన్నని మంచినీళ్ళు తాగి కడుపు నింపుకోనూ.. వాంతి కొచ్చేట్లుంది. ఇక ఈ రోజు గత్యంతరంలేక వాణ్ని వదిలి బైటికొచ్చాను''

''అయ్యో బాబుకెలా ఉందో'' నాకు నిజంగానే బాధనిపించింది.

''జొరం తగ్గింది వచ్చేముందు కూడా వాడి చేత బన్ను రొట్టె తిన్పించి, మాత్ర వేసి పడుకోబెట్టి వచ్చాను''




''ఒంటరిగా పడుకుంటాడా? భయపడడా?''

ఆమె మరలా విషాదంతో కూడిన నవ్వు నవ్వింది. ''మాకు చీకటంటే భయం వేయదు. ఒంటరితనమన్నా భయమనిపించదు. ఆకలంటేనే భయం''

అన్నం ఉడుకుతున్న శబ్దం...కుక్కర్‌లోంచి శబ్దం చేస్తూ ఆవిరి బైటికొచ్చినపుడల్లా కమ్మటి వాసన ఇంతకు ముందెన్నడూ గమనించలేదు. అన్నం ఉడుకుతున్న వాసన ఇంత తీయగా ఉంటుందని...

''నా వళ్ళు గుల్లయినా సరే బాబుని చదివిస్తాను. బతుకుతుందే వాడికోసం. లేకపోతే ఇలా వల్లమ్ముకు నేదాన్నే కాదు. ఏ నూతిలోనో దూకి హాయిగా చచ్చిపోయి ఉండేదాన్ని'' అంటోందామె నాకు చప్పున మా అమ్మ గుర్తొచ్చింది. నలుగురు పిల్లలు పుట్టాక నాన్న చనిపోయాడు. పొలం నుంచి తిరిగొస్తుంటే పాము కాటేసి.. అమ్మ అధైర్య పడలా. మగాడిలా కష్ట పడింది. రెక్కలు ముక్కలు చేసుకుని నలుగురు పిల్లల్ని సాకింది. ఎపుడైనా ఆమె మనసుకు కష్టమనిపిస్తే ''ఈ సంసారాన్ని నేను లాగలేను. నా చాతకావటం లేదొదినా. బతకాలన్న ఆశలేదు. ఈ పిల్లల కోసమని బతుకుతున్నా గానీ లేకపోతే ఇంత విషం తిని చచ్చిపోయి ఉండేదాన్ని'' అని బాధపడేది.

ఎవరి అమ్మైనా ఒక్కటే. పిల్లల కోసం కరిగిపోయే కొవ్వొత్తి..

సమయం మూడు గంటలు కావస్తోంది. ఆకలితో పాటు తన్నుకొస్తున్న నిద్ర...రెండిట్లో ఏది బలమైందో... ఒక్కోసారి నిద్ర ఓడిపోతూ...మరోసారి ఆకలి ఓడిపోతూ...

''భోజనం రెడీ. డైనింగ్ టేబుల్ మీద సర్దేస్తాను. పదండి'' అందామె.

ఆ మాట కోసమే తరతరాలుగా ఎదురు చూస్తున్నట్లు వెళ్ళి డైనింగ్ టేబుల్ దగ్గర కూచున్నా.

కంచంలో వేడివేడి అన్నం పొగలు కక్కుతోన్న మంచు ముద్దలా తాలింపు పెట్టిన ముద్ద పప్పు నెయ్యి వడ్డించింది.

''నువ్వు తినవా''

''మీరు తిన్నాక తింటాను'' అంది పక్కన కూచుంటూ. అన్నం కలుపుకోబోతుంటే ''జాగ్రత్త బాగా వేడిగా ఉంది'' అంటూ లేచి నిలబడి ''నేను తినిపిస్తానుండండి'' అంది.

అన్నం బాగా వేడిగా ఉందనుకుంటాను మధ్య మధ్యలో చేతిని వూదుకుంటూ అన్నం కలిపింది. పప్పుతో పాటు ఆవకాయ కూడా కలిపి ముద్ద చేసి నోట్లో పెట్టింది. అలా పెడ్తున్నప్పుడు తన నోరు సున్నాలా చుట్టింది. అచ్చం మా అమ్మలా...

మా అమ్మ అన్నం ముద్దలు తిన్పించేటపుడు తన నోరు సున్నాలా తెరిచేది. నాకలా తన నోటి వైపు చూస్తూ తినడం చాలా బావుండేది.అన్నం తినడానికి నోరెలా తెరవాలో కోడి పిల్లలకు నేర్పుతున్న తల్లీ కోడిలా మా అమ్మ...

ముద్ద ముద్దకూ సున్నాలా మారుతున్న ఆమె పెదవులు నన్ను బాల్యంలోకి లాక్కెళ్ళుతున్నాయి. అన్నం ఇంత రుచిగా ఎప్పుడూ లేదు. నా చిన్నతనంలో అమ్మ తిన్పించిన గోరు ముద్దల రుచి కడుపు నిండుతోంది. కమ్మగా...తీయగా...మధురంగా... అమ్మ జోలపాటలా ఉంది. అమ్మ ఒడిలాంటి నిద్ర...వూయలలూపుతూ... తను మంచినీళ్ళు తాగించిన గుర్తు.

ఉదయం లేచేటప్పటికి తెల్లగా తెల్లారింది. నేను మంచం మీద ఉన్నాను. బహుశా తను పడుకోబెట్టి ఉంటుంది. ఆమె కోసం చూశాను. లేదు. తలుపు దగ్గరగా జేరవేసి వెళ్ళిపోయి ఉంటుంది. దుప్పటి తీసి లేచి కూచున్నాను. తల దగ్గర ఐదు వందరూపాయల నోట్లు...

అయ్యో..మరిచిపోయిందా... లేదు. తను హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకోవడం నేను చూశాగా.. నోట్లతో పాటు చిన్న కాగితం ఉంది. అందులో ఒకే ఒక వాక్యం రాసుంది.

''నన్ను వాడుకునే వస్తువులా కాక సాటి మనిషిలా చూసినందుకు కృతజ్ఞతలతో''